# కొత్త రచయితలు

## లవ్ స్టోరి సరసం

"నాఉత్తరం కారణంగా నీపై అలిగి పుట్టింటికి వెళ్ళిపోతే రియల్లీ అయాం సారీ ఫణీ! అయినా ఆ లెటర్‌ని నువ్వే అందుకుంటావను కున్నాను. నీకు పెళ్ళయి...తోడుగా 'నే-కాకుండా' ఇంకో మనిషి వుందంటే...ఎందుకో నాకింకా నమ్మకం కల్గటం లేదు."

అనుపమ మాటల్ని తలుచుకుంటూ బెర్త్‌పై అనీజీగా కదుల్తున్నాను. ట్రైను తొంభయి కిలో మీటర్ల వేగంతో వెళ్తూన్నా నాకెందుకో మెల్లిగా పోతున్నట్టే వుంది.

ఒక్కసారిగా మా ఊళ్ళో వాలి అనూ వ్రాసిన ఆ ఉత్తరాన్ని నా శ్రీమతి కంటబడకుండా పోస్ట్‌మాన్ నించి లాగేసుకోవాలనుంది. కాని సమయం మించి పోయింది. అనూ లెటర్ అంటే...అది ఎంత అధ్వాన్నంగా వుంటుందో పోస్ట్‌మాన్‌కి కూడా తెల్సు రెండేళ్ళ క్రితం వరకూ. ఫ్రమ్ అడ్రస్ దగ్గర తప్పనిసరిగా ఓ లవ్ మార్క్ లేదా ఇంకో చిలిపి బొమ్మో వుండి తీరాల్సిందే. క్యూరియాసిటీతోనైనా నీలిమ ఆ కవర్ చింపి చదువుతుంది.

అదే జరిగితే?

మా కొత్త కాపురం ఏమయిపోతుంది?

నీలూ అసలే కోనసీమ పిల్ల. వాళ్ళ వాళ్ళం దర్నీ పిలిచి, ఈక ఈక పీకి నాపై ఓ పాక కట్టేసినా ఆశ్చర్యపోనవసరం లేదు.

గిలగిల్లాడటం మినహా ఇపుడు నేనేం చేయ గలను?

"ఎంత మోసగాడివి ఫణీ ఏం? నీ పెళ్ళి ఆపు చేయించేస్తాననుకున్నావా! నన్ను పిలవ కుండానే పెళ్ళి చేసేసుకున్నావ్? పోనీలే నా మాట మన్నించి కనీసం ఈ పెళ్ళికయినా వచ్చావు. నువ్ ఛీకొట్టినా నీకు లెటర్ వ్రాశానని నాపై అసహ్యంగా వుందా? నీ మీద పిచ్చి ప్రేమతో ఏదేదో వ్రాసేశాను. ఏం అనుకోకేం? నువ్వు పరాయి వాడివి అయ్యావంటే నిఝం! నా మనసు ఇప్పటికీ ఒప్పుకోవడం లేదు."

వద్దనుకున్నా అనూ మాటలే గుర్తుకు వస్తున్నాయి.

ఒకోసారి ఆమె నిజంగా పిచ్చిదేమోనని పిస్తుంది. చాలాసార్లు మూడీగా మాట్లాడుతుంది. ఆ మాటలకి అర్థం పర్థం వుండదు.

ఆ అతిప్రవర్తన నచ్చకే రెండేళ్ళనించీ ఆమెని దూరంగా వుంచాను. నేను జీవితంలో చేసిన పెద్ద తప్పు అనూతో పరిచయం పెంచుకోవటం, ప్రేమ లేఖలు వెలిగించడం. అయితే ఆమెని పెళ్ళి చేసుకోకుండా నా తప్పుని సరిదిద్దుకున్నాను. నా జీవితాన్ని కాపాడుకున్నాను.

కొంత మంది తాము సుఖపడరు-ఎదుటి వాళ్ళని సుఖపడనీయరు. అనూ ఆ కోవకి చెందిన మనిషే.

గతం కంటికి కన్పించకుండా, మనసుని బాధించకుండా జాగ్రత్త పడ్డాను. కాని రెండేళ్ళ తర్వాత అనూ ఇలా ఉత్తరం వ్రాస్తుందని నే ఊహించలేదు. ఆ ఉత్తరం కూడా పోస్టల్ డిపార్ట్ మెంట్ పుణ్యమా అని లేటుగా అయినా చేరి వుండాలి లేదా మిస్సయినా అవ్వాలి. నేను నా ప్రాణ స్నేహితుడి పెళ్ళికై ఢిల్లీకి బయలుదేరే రోజు వరకు ఏ ఉత్తరం రాలేదు అనూనించి. ఆమె ఈ పెళ్ళికి వస్తుందని నేనూహించ లేదు కూడా.

నాకు పెళ్ళయి యింకా నెల పూర్తిగా కాలేదు. ఈలోపే అనూ వ్రాసిన ఉత్తరం కారణంగా భార్యకి ఎక్స్‌ప్లనేషన్ ఇచ్చుకోవాల్సి రావడం... నీలిమ నన్ను సరిగా అర్థం చేసుకుంటుందా? లేక అల్లరి పెడ్తుందా?

నా పెళ్ళిలో నా అరవయి మంది స్నేహితులకి, అర్థరాత్రి మూడోసారి కాఫీ రావడం ఆలశ్యం అయిందని నానా గొడవ చేశాను. నా ఫ్రెండ్స్ చేతకూడా మాటలన్పించాను. ఇప్పుడు కొత్తగా పెళ్ళయిన వాణ్ణి ఇంకో అమ్మాయితో నాకో ఎఫైర్ వుందని అనుమానమొస్తే తప్పనిసరిగా నాపై ఫైరవుతుంది. పర్యవసానం ఎలా వుంటుంది? ఎలా మానేజ్ చేయాలి?

ఆలోచనలతో మెదడు వేడెక్కింది.

"ఒకోసారి నిన్ను చంపేయాలన్నంత కోపం వచ్చేది. నువ్విప్పుడు నా కళ్ళెదుట వుంటే మాట పెగలడం లేదు. నా ఖర్మకి నేనే హీరోయిన్‌ని. అందుకే నిన్ను పోగొట్టుకుని ఇండియా వదిలేస్తున్నాను. రేపే స్విట్జర్లాండ్ వెళ్ళిపోతున్నాను. ఇక నీకు జీవితంలో తారసపడను."

అనూ మాటలు తల్చుకున్న కొద్దీ నాలో అలజడి పెరిగిపోతోంది.

రకరకాల ఆలోచనలతో ట్రైన్‌లో ఆ రాత్రి నాకు నిద్ర కరువయింది.

ఉదయం ఆరు గంటలవుతూండగా మా ఊళ్ళో రైలు దిగాను.

జరగబోయే అవమాన కార్యక్రమాన్ని ఊహించుకుంటే ఇంటికెళ్ళాలన్పించడం లేదు. కాని వెళ్ళక ఏం చేయను? తప్పేదేముంది?

చేసుకున్న వాళ్ళకి చేసుకున్నంత! ఇల్లు దగ్గరయ్యే కొద్దీ వైరాగ్యం వచ్చేస్తోంది నాలో. ఉదయం ఆరున్నర నించి ఏడున్నర వరకూ పూజలో వుండటం నా శ్రీమతికి అలవాటు. ఉప్పెన వచ్చినా సరే ఆ టైమ్‌లో వులకదు పలుకదు ఆమె. సరిగ్గా ఆ టైమ్‌కే ఇంటికి చేరుకునేలా మెల్లిగా నడుచుకుంటూ వచ్చాను.

నా ఇంట్లోకి వెళ్ళడానికి నాకే భయంగా వుంది. తడబాటుని అణుచుకుని మొండి ధైర్యంతో కాల్ బెల్ నొక్కాను.

నేనూహించని విధంగా 45 ఏళ్ళ పెద్ద మనిషి—నా పెద్ద బావమరిది తలుపు తెరిచేటప్పటికి నాకు బేజారెత్తింది.

"ఎప్పుడొచ్చారు?" అన్నానేమో అనుకున్నాను. కానీ అతడికి విన్పించి వుండదు.

పలకరింపుగా నవ్వి, "ఫ్రెష్ అయిరావోయ్-తర్వాత మాట్లాడుకుందాం-రాత్రి నిదుర లేదు" అంటూ ముసుగు తన్నేశాడాయన.

శ్రీమతి మామూలుగానే పూజలో వుంది.

ఎదురుగా టేబుల్‌పై అనూ వ్రాసిన ఉత్తరం. చదివిన గుర్తుగా చింపి వుంది. జీవితంలో మొట్టమొదటి సారిగా అంత ప్రొద్దుటే దాహమేసింది నాకు. గుటకలు మింగుతూ ఉత్తరాన్ని చేతిలోకి తీసుకుని కుర్చీలో కూలబడ్డా.

బావా

నవ్వుకుంటున్నావా? నిజం ఫణీ, నిన్నెందుకో ఈసారి అలాగే సంబోధించాలనిపించింది. ఎంకిలా రెచ్చిపోవాలనుంది. ఎదురుగా

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

వుంటేనా!? ముక్కు పట్టుకుని మూడు మి ర్లు సాగదీద్దును.

నమా, ఎలా వుంది నీ కొత్త కాపురం? పి బావా, పెళ్ళని నాకెందుకు వ్రాయలేదు, తెలిస్తే అడ్డుపడ్తాననుకున్నావ్ కదూ, ఎందుకంత భయం? పెళ్ళిళ్ళు స్వర్గంలోనే నిశ్చయ మయిపోతాయట. తల్చుకుంటే నాకు ఉక్రోషం ఆగడం లేదు. నా కళ్ళనీళ్ళు ఈ ఉత్తరంపై పడకుండా ముగించేస్తాను. బావా, నాదో చిన్న కోరిక. బహుశా నిన్ను కోరే చివరి కోరిక కూడా. అలా అని నేనేదో ఆత్మహత్య చేసేసుకుంటానని ఊహించకు! నా ధైర్యం గురించి నీకు చెప్పాల్సిన పని లేదు. అవునా! ఇంతకీ సారాంశం ఏమిటంటే, మన ఫ్రెండ్ తారక రావ్ పెళ్ళికి నువ్ తప్పనిసరిగా ఢిల్లీ రావాలి. నీతో ఏవేవో మాట్లాడాలని కాదు. సీరియస్‌గా చెప్పనా? చివరి సారిగా నిన్ను చూడాలని. నా కళ్ళనిండా నిన్నే నింపేసుకోవాలని. దయచేసి వస్తావ్ కదూ! గుర్తున్నంత వరకు రెండేళ్ళ క్రితం నీ అడ్రస్‌కే వ్రాస్తున్నాను. ఈ ఉత్తరం అందినా అందక పోయినా నీ కోసం నేను ఢిల్లీకి వస్తున్నా. ఎప్పుడెప్పుడు నా పిచ్చి బావని చూస్తానా అని వుంది. నిజం ఫణీ, నువ్ నిజంగా పిచ్చి బావవే. నీ శ్రీమతిని అడిగానని చెప్పకేం? వ్వె వ్వె వ్వె అని వెక్కిరిస్తూ శలవు తీసుకోనా? లేక విత్ కిసెస్ అని ముగించనా?...

ఉత్తరం పూర్తిగా చదవకుండానే చింపి చెత్త బుట్టలో పడేశాను. అప్పటికే చెమటతో నా చొక్కా తడిసిపోయింది. ఇంట్లోని నిశ్శబ్దం నా కంగారుని ఇంకా పెంచేస్తోంది.

నీలిమ చాలా గట్టిగానే అపార్థం చేసుకుని వుండొచ్చు. అందుకే అన్నగారిని పిలిచింది.

ఈ రోజు నా పరువు నే మోయలేనంత బరువుగా మారిపోతుంది.

ఎలా తప్పించుకోవడం?

ఇల్లంతా చుట్టాలతో నిండిపోయి నేను నీలూతో మాట్లాడలేనంత బిజీలో వుండిపోతే?

వచ్చిన ఈ పెద్దమనిషికి సడెన్‌గా హార్ట్ ఎటాక్ వచ్చేస్తే? ఒక్కసారిగా భూకంపం వచ్చేస్తే?


రచయిత చిరునామా

సి.ఎల్. నారాయణ

సత్యానగర్ ఇలాలాపేట,

సికింద్రాబాద్-500 017




ఏమీ కాకుండానే ఏడున్నర అయినట్టుంది. కాఫీ కప్పుతో నీలిమ ప్రత్యక్ష మయింది.

"ఏమిటి అంత దీర్ఘాలోచన? పెళ్ళి 'బాగా' జరిగిందా?" కూల్‌గా నవ్వింది.

నే జవాబిచ్చేంతలోనే పొడి దగ్గుతో వాళ్ళన్నయ్య రంగ ప్రవేశం చేశాడు.

"ఏమోయ్ ఫణీ, నీలూని కూడా తీసికెళ్ళక పోయావా నీతో, ఇక్కడ ఒక్కత్తినీ వుంచేశావ్. ఆ!"

నా నోట్లోని కాఫీ ఘన పదార్థంగా మారిపోయినట్టనిపించింది. మాట్లాడదామన్నా గొంతు పెగలడం లేదు.

నీలూని నాతో తీసుకెళ్ళి వుంటే ఈ ఉత్తరం ఆమె కంట పడేది కాదు. కానీ అక్కడ అనూధాటిని ఏ రకంగా అర్థం చేసుకుని వుండేదో? ఏ చెంపపై కొట్టినా ఒకటే.

"ఏంటి ఆ ఉత్తరాన్ని అలా చించేశారు?" నీలిమ ప్రశ్నకి నా చేతిలోంచి కాఫీ గ్లాసు జారి ఒళ్ళో పడింది.

"అయ్యయ్యో! అన్నీ చిన్న పిల్లాడి పన్లే" అందంగా విసుక్కుంటూ తడి టవల్ కోసం పరుగెత్తింది.

"ఆ! మొత్తం మీద మీ బావ బావ మరదుల పరసం బాగానే వుందయ్యా!" భళ్ళున నవ్వుతూ నాకేసి చూశాడాయన.

ధోషిలా తల వంచుకుని ఒలికిన కాఫీ కేసి చూస్తున్నా–నా పంచేంద్రియాలూ క్రమంగా పనిచేయడం మానేస్తున్నట్టనిపిస్తోంది. నాలుక రుచిని కోల్పోయింది. మాట్లాడటానికి నోరు సహకరించడం లేదు. వినికిడి శక్తి కూడా పూర్తిగా పోకుండా ఆయనేం చెప్తాడా అని

"నువ్వేమో లేడీ నేమ్‌తో గ్రీటింగ్ కార్డు పంపావ్! వాడేమో డైరెక్టుగా నీ కాపురానికే ఎసరు తెచ్చే బాంబులాంటి లెటర్ పోస్ట్ చేశాడు!! మా అర్జున్ చదివేది బి.ఎస్‌సి. అయినా మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ అని నిరూపించుకున్నాడు. మొత్తం మీద బావగారిని ఓ ఆట ఆడించాడు" చెప్పటం పూర్తవగానే ఇంకోసారి భళ్ళున నవ్వాడాయన.

ఆయన అలా దగ్గుతూ, నవ్వుతూ వుండగానే కొద్దిగా స్పృహలోకి వచ్చా. నా బుల్లి బావమరిదిని ఏడ్పిద్దామని సరదాగా ఆ మధ్య ఓ అమ్మాయి పేరుతో గ్రీటింగ్ కార్డు పంపాను. కాని అది ఈ రకంగా ఇవాళ నన్ను రక్షించిందంటే నాకు నమ్మకం కల్గటం లేదు.

"రైటింగ్ కూడా వాడిది కాదు. కాలేజ్‌లో ఎవరిచేత వ్రాయించాడో? రేపు వాడి పెళ్ళయ్యాక కూడా ఇలాగే చేస్తే తెలిసొస్తుంది వెధవకి."

తమ్ముడి ప్రతిభ అనుకుని మురిసిపోతూ విసుక్కుంది నా శ్రీమతి. చెమట పట్టి చలికి వణుకుతున్న వాడిలా వుంది నా పరిస్థితి. థాంక్ గాడ్! ఇప్పటికీ గండం గడిచినట్టే. అవసరమైతే నీలూకి నిజం చెప్పి అయినా సరే తర్వాతి పరిస్థితిని మానేజ్ చేసుకోగలను.